ప్రాయంగా ఉంటుంది. ఈయన కూడా ఈ సంవత్సరం కీర్తిశేషులయ్యారు. గృహలక్ష్మి సంపాదకులుగాను, స్త్రీజన సాహిత్య సముద్ధారకులుగాను విద్యాపోషకులుగాను కేసరిగారు చేసిన సేవకంటే ఈ చరిత్ర వ్రాయడంద్వారా మన సాహిత్యానికి అమూల్యసేవ చేసి ఈ దేశపు వచనసాహిత్య చరిత్రలో తమ నామధేయం సుప్రతిష్ఠితం చేసుకొన్నారు.

ఆంధ్రదేశ చరిత్రగురించి, ఆంధ్రభాషాచరిత్ర గురించి ప్రామాణిక గ్రంథాలు తెనుగులో ఇంత వరకు లేవు. ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం వచ్చిన తర్వాత విశ్వకళాపరిషత్తుద్వారా ఈ పని చేయించాలని చాలామందికి కుతూహలంగావుంది. త్వరలోనే ఆంధ్రవిశ్వకళాపరిషత్ యీ పనికి పూనుకొంటుందని ఆశించవచ్చు. ఆంధ్రదేశంలో ఈ సంవత్సరం హిస్టారికల్ రికార్డుస్ కమిషన్ సమావేశం, చారిత్రక మహాసభ జరిగింది. వాల్తేరులో జరిగిన యీ సమావేశంలో, ఆంధ్రుల చరిత్రను గురించి కొన్ని కొత్త విశేషాలు తెలియపరచారు. ఇవి అన్నిటినీ పొందుపరచి, సమగ్రమైన ఆంధ్రుల చరిత్ర రావలసియున్నది. ఆ కార్యము-తమ అవసరాలకోసం ఆత్మలాభాలకోసం చారిత్రికవాదాలను సమయోచితంగా మార్చుకొనే అవకాశవాదులయిన ఆచార్యవర్యులుగాక ఆత్మోపలబ్ధి ఆశించకుండా యథార్థాన్ని ప్రకటించే చారిత్రిక పండితులు రావాలి. అటువంటివారిచేతనే ఈ యుత్తమకార్యాన్ని మన ప్రభుత్వంకాని - విశ్వవిద్యాలయంగాని చేయించాలి. చిరకాలంగా ఈ కృషిచేస్తున్నవారిలో అగ్రగణ్యులు అస్వార్థజీవులు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు. వారికి ఈ సంవత్సరం షష్టిపూర్తి చేయ్యాలని కొందరి మిత్రులు సంకల్పించి ఎదో చంద్రునకు నూలుపోగన్న చందం చేశారు. శర్మగారికి నిజంగా జరగవలసిన సన్మానం ఇదికాదు. అది ప్రశంసలతోనూ బహుమానాలతోను జరగవలసిందికాదు. శర్మగారు ఆంధ్రచరిత్రగూర్చి చేసిన పరిశోధనలను, కృషినీ ఆంధ్రజాతి చరిత్ర వికాసానికి సమగ్రగా ఉపయోగించుకొని వారికన్ని సదుపాయాలూ కలిగించి వారిచేత చరిత్ర వ్రాయించడంలోవున్నది. వారిని సత్కరించి వారిచేత ఈమహత్ కార్యం చేయించగల్గితే అది వారికి సన్మానంకాదు యావదాంధ్రజాతి సన్మానం జరుపుకొన్నట్లు.

---

క థా ని క

# జానపదవిలాసం

ప్రజిల

“ఏమండీ! అక్కయ్యగారున్నారా” అన్నాను ఒక అడుగు లోపలకువేసి

“లేరండీ! ఏం మీ అక్కయ్యగారు లేకపోతే రాకూడదాండీ?”

“అబ్బె.. అదికాదండి...” అని నుంచున్నాను వెళ్దామా ఉందామా అని.

“యాండి, సిట్టిబాబులుగారు- గాతుగెద్దులాగ అలా తుపాకు మెళ్ళమీదెట్టుకు తిరగడమేనా-మాసేత ఏమయినా పిట్టమాఁవసం తినిపిస్తారా?”

నాకది అవిడతో రెండవసారి మాట్లాడ్డం - అంచేత అంతచనువైన మోటయిన ప్రశ్నని ఆశించలేదు.

“అసలు పిట్టలు సత్తాయాండి తగిల్తాను?” మళ్ళీ అడిగింది.

“నేను వుత్త పల్లెటూరు బైతులు కానండి - ఎంతెంత పెద్దవి పడతాయనుకున్నారు.. ప్రొద్దుట నేను ఇంకా కొడదామని చూస్తుంటే ఆ రత్తాలు కొడుకు పెద్దగొప్పగాను “ఏమండోయ్ మాఁవగారు అలా ఆ తోడుపుసేలో పదండి మంచి గుడ్డికొక్కిరాయిలు పడతాయి - యెరకలోళ్లకూడా పాయం వుంటారు” అని వేళాకోళం చేశాడు.

“నిలువుబత్తెం పుచ్చుకున్నారేంటి-కూచోండి. మీ అక్కయ్యిప్పుడే వస్తారు.”

తుపాకీ పక్కన పెట్టి బస్తామీదకూర్చున్నాను.

"మరి మీరూరుకున్నారేండి సిట్టిబాబులు గారు!"

"నేనూరుకోలేదే - కుందులోళ్ళ గుడిసెల్లోను, కొమ్ములోళ్ళ గుడిసెల్లోను, ఇంకా బలేబలేపిట్టలు పడతాయండోయ్ అన్నానండి"

"నిజమేనండి సిట్టిబాబులు - అసలు బత్తీ వోళ్ళకి మేం వడ్డీపాయిదాలయినా సెప్పలేవండి, అయినానండి మావూరు మరీ అద్దైతంముండా వూరండి, ఓ నరదా, ఓ మంచీ సెడ్డా ఏమీ లేవండి...ఇప్పుడు సూడండి మీరెంత, నేనెంత, ఈలాగ మాట్లాడుకోటం సూసేరంటేనండి మీకూనాకూ ఏదోవుందని పెట్టేస్తారు. అది వూరంతా ఎల్లిపోతాది"

"ఊఁ..." అన్నాను విధిలేక, ఆవిడ పప్పు రుబ్బుతూంది, నాకెదురుగానే కూర్చున్నా, నావంక చూడకుండానే మాట్లాడుతూంది: చనువుగా మాట్లాడటం పల్లెటూరి పద్ధతి మరి.

"ఆ రత్తాలు కొడుకున్నాడు, మిమ్మల్నేదో అన్నాడన్నారు. ఆడు మరీ పోకిరీసచ్చినోడు - అయినా సిట్టిబాబులుగారు ఆ కొమ్ములోళ్ళ గుడిశెల గొడవ మీకెలా తెలిసిందండి?"

"ఎదురుగావుండి అనరుకాని - వూరంతకీ తెలిసినసంగతే గదండీ...పైగా ఇంత చిన్న వూరులో ఎన్నాళ్ళు దాగుతుంది."

అసలీ దిబ్బమీద కాపులదంతా అంతేనండి - రంబల్లాంటి పెళ్ళాలున్నా - గుడిశల్లో దూరడం వాళ్ళు పెట్టిన మందులుతిని ఏడవడంను"

"నిజంగా రత్తాలుకొడుకు అలాంటివాడే అంటారా-కుర్రాడే గదండీ" నిజాన్ని బలపరిస్తే విందామని అన్నాను.

"ఆ పేగులోంచి వచ్చినోడే కదండీ - ఆడి బుద్ధులే ఈడివ్వను. ఆ కుప్పుస్వామి దింపులోడు ఆడిపెళ్ళానికి మొన్న నేకదూ రత్తాలు ఇల్లు కట్టించి పెట్టేడు, దాని కూతుర్నే మళ్ళీ ఈడి కొడుకు ... మల్లా ఆడోళ్ళయితేనండి-ఇంత బోడ్డూడని కుర్రాడికికూడా తోలగాలి-ముండా 'గోసా!"

"ఏమండీ-మీ పేరేమిటండీ?" అన్నాను టాపిక్ మారుద్దామని.

"పోనిద్దురూ-మా పేర్లేం-మీ పేరుల్లాగా నాజూగ్గా వుంటాయా ఏమన్నానా."

ఇంతలో "మాఁవా అమ్మ రమ్మన్నాది" అని మా అక్కకూతురు వచ్చింది "కూర్చోవే-కాసేపు ఎల్దురుగాని" అన్నది.

"ఏమోనత్తా-మా అమ్మ పిల్చుకురమ్మన్నాది" అన్నది కుసుమ.

"ఓయమ్మ మీ సుంకరోరి ఆడబోడుసులకి అసలే చెప్పలేఁవమ్మ" అని వక్కవిసురు విసిరింది దాన్తో కుసుమ నా పక్కన కూర్చున్నదే కాని నన్ను గోకుతూ నేవున్నది వెళ్లిపోదామని.

"ఏండి మీరు కుసుమాంబని చేసుకుంటారా పాపం కూడా తిరుగుతున్నది?" అన్నది.

"ఛీ! నల్లగా ఉంటుంది దీన్నెవడు చేసుకుంటాడండి!" అన్నాను.

"అల్లా గనకండి - నల్లగావుంటే అందంగా వుండరా, మొదట మీ అక్కని పీటులమీద చూసినప్పుడు 'అత్తగారు మంగలాణ్ణి చీపురు కట్టతో కొట్టిందట పిల్ల నల్లగావున్నదని చెప్పి నందుకు...కొడుకు పెద్ద అందగాడని...ఇప్పుడేమోనండి పెళ్ళిచూపుల దగ్గర్నుంచి అన్నిటికీ మీ అక్కగారితోనే పని"

"ఊఁ..."

"ఇంకా ఇప్పుడు నయం కానండి చిట్టి బాబులూ మొదటనే నీవూరు వచ్చినపుడు అస్సలా ఇలా మసల నిచ్చేవాళే కాదు. ఈ పువ్వులకోక కట్టుకున్నదని ఆ లేసుబాడీ ఏసుకున్నదని తిప్పుకుంటూ నడుస్తాదని దారంట నడుస్తుంటే- "ఓరోయ్ పట్నంమనిసొత్తున్నదిరోయ్" - అని అరుగులమీదనుంచి కేకతీసి తినేసేవోళ్ళు, అరవై ఏళ్ళు ఆ ముసిలోడికి ఎంకన్నకికూడా అదే రొదవ ముండారోగం."

"ఊ..." అన్నాను-నవ్వుతూ.

"అందుకనే ఎవరికీ తెలీకండా ఆ కాలవ గట్టులో నడిచివస్తాను. నాకిక్కడే అలవాటు- మీ పెద్దక్కయ్యగారింట్లోనే వుంటాను ఎప్పుడూను-పైగా మా ఇంటాయనికి నేను రెండో పెళ్ళాన్నని మరీలోకువ. ఆయనకి కొబ్బరికాయ యవ్వారం తప్ప ఇంకేమీ అక్కర్లేదు" అన్నదావిడ.

అప్పటికి ఆవిడ పయట పూర్తిగా జారిపోయింది. రెండు చేతులలా పనిలో వుండడం మూలముగా ఆవిడ సర్దుకోనూలేదు. ముప్పయ్యేళ్లటాయి. ఐనా యవ్వనపు రేఖలు-పోత విగ్రహంలో వున్నట్టు-ఇంకా చెదరకుండా నేవున్నాయి. అన్నట్టు ఆవిడకు పిల్లలేరన్నదికదూ. నుదురుమీది చిరుచెమటబిందువులు నీరెండలో చిరునవ్వు నవ్వుతున్నాయి. ఎబ్బెట్టుగానేవున్నా ఆవిడవంక ఒకక్షణకాలం చూస్తూ కూర్చున్నాను.

"ఏమండీ, అలా చూస్తున్నారేఁ?" నావంక తిరిగి అన్నది.

గతుక్కుమన్నాను ఆ ప్రశ్నకి. ఆవిడ ముఖంలో చాలా అనుభవం తాండవిస్తున్నది; నాకు జవాబు దొరకలేదు అందుచేతనే కాబోలు;

"వస్తానండీ-"అని లేచాను, కుసుమ, నేను బయటికి వచ్చేసేము. "అమ్మ చూసిందంటే, ఏమన్నా వున్నదా!" కుసుమ అన్నది.

"ఏఁ"అన్నాను.

"అది మంచిది కాదు, ఎదవగంప."

"ఛీ! ఏమిటా తిట్లు!" అన్నాను; కుసుమ వూరుకున్నది.

ఇప్పటిదాకా "అత్త", ఇప్పుడేమో "గంప" అయ్యిందా అని చిన్న జెల్లకొట్టేను.

దారిలో అరుగుమీదనుంచీ, "ఏఁ పట్నం మరదలా, మేనకోడలతో సికారుబయల్దేరేవేఁటి" అన్నాడు రత్తాలు.

ఆయనికి పురుషత్వం అవసరం. దానికంటే ఒకపాలు ఎక్కువ. అంచేతనే మొగాళ్ళనికూడా "మరదలా"అని సంబోధిస్తుంటాడు. కూర్చోమంటే కూర్చున్నాను.

"ఏఁ భావగారు, పరీక్ష పాసయ్యావటు, పై చదువు డాక్టరు చదువా?" భుజంమీద తడుతూ రత్తాలు అడిగేడు.

"అవునండి" అన్నాను.

"ఇద్యంటే - పట్నవోళ్ళదేనండి! ఆయ నెంతున్నాడో చూడు అంటున్నాడు" ఒకాయన.

"ఏఁవండీ-మరిగంటేను మా రెడ్డిగారి కూతురు చదువుతున్నదీ డాక్టరేనట మీకు తెలుసా" అనడిగేడు ఇంకో ఆయన.

వూరుకున్నాను మాట్లాడకుండా.

"అది పైనలియర్రా అంటే అకరేడాదన్న మాట. ఈయనింకా మొదటేడాది. లేపోతేపో ఆది మనూరికి డాక్టరమ్మయి నీచేత నాచేత పురుళ్ళు పోయిస్తాది!" అన్నాడు రత్తాలు.

"ఓస్ అదిరా అసలసంగతి! అందుకే రెడ్డి కూతురికి పెళ్ళి పెయత్నాలు జరుపుతున్నాడు" రత్తాలు తండ్రి.

"దాని మొఖం దానికీ-నాకు పెళ్ళేమిటి, దానికేనాడో మూడు పదులు దాటిపోయినియ్యి ఇంక దాన్నెవడు చేసుకుంటాడు" అన్నాడు రత్తాలు.

"మంచి పనేలోయ్. బోల్డుమంది దాన్నెగరేసుకు పోడానికి సూత్తున్నారట. పిల్ల మా నెడ్డ ఇదిగా వుంటాదిగామరి" అన్నాడింకో పెద్ద మనిషి.

"ఎంతుకుండదు, పిల్లా ఇదిగానే వుంటాది. దాని బుద్ధులూ ఇదిగానే వుంటాయి. అసలీ డాక్టరు జాతి అంటే వృత్తి సినిమాజాతి అనుకో-చండాలం" చాలా నిరసనగా అన్నాడు రత్తాలు.

"ఇదీ-ఆ బోడిరాణి కొడుకుతో తిరిగేది. ఏమాత్రమే ఆడిదగ్గరది చేరదీసినట్టున్నాది కూడాను, ఇప్పుడు దీనికి పెళ్ళా! ఆడితో అయిదేళ్ళు కాపరం చేసిందా - ఈడితో ఇంకో అయిదేళ్లు-ఇంకొకడితో..."మళ్లీ అన్నాడు రత్తాలు.

"అయిదేళ్ళే!!! ఏమన్నా పిల్లలా!" రత్తాలు తండ్రి బోసినోరు పెద్దదిచేసి అడిగేడు.

"చదువుకున్నవాళ్లేఁ చాకలోళ్లనుకున్నావా-పిల్లల్ని పుట్టనివ్వడానికి. అయిదేళ్ళు కాదు-పందేళ్లు కాపరం చెయ్యనీ - వాళ్ళయిట్టంలేనిదే పిండం బయటికిరాదు"రత్తాలు సమాధానం. "అందులోకి డాక్టరు చదువు - చేతిలోపని" మళ్ళీ "ఏదో అంటారేఁ దేఁవుడు వరంమిచ్చినా పూజారి ఇవ్వలేదన్నట్టున్నది!" ఆ ముసలాయన చాలావిస్తుపోయాడు పాపం.

మొత్తంమీద రత్తాలు గట్టివాడే విమర్శకుడే తనదాకావస్తే ఏమోకాని ఆవిడ చెప్పినట్టూను. పెద్దరైతు బోలెడంత కొబ్బరికాయ వ్యాపారం, అంచేత తరుచుపట్నాల్లో నేకుంటాడు. అనుభవా

నికి ప్రపంచజ్ఞానానికి లోటులేదు నలభైఅయిదు - యాభైసంవత్సరాల మధ్యపడ్డా ఇంకాఖుదురాలా వుంటాడు. శ్రీచూర్ణంబొట్టు ఎప్పుడూ నుదుటి మీద నాట్యమాడుతూనే వుంటుంది.

నిజంగా డాక్టరు చదువు మంచిదికాదు చదవ కూడదనే అనుకున్నాను. "వస్తానండి" అని లేచాను

"మంచిది మరదలా" అన్నాడు.

భోజనంచేస్తున్నాను, "ఏ,రా - దాన్తోనీకా సంభాషణలేమిటి" అని అక్క అంటే - పిడుగు పడ్డట్టయింది - ఎవరు చెప్పేరో! ఎదురుగావున్న కుసుమని అడిగేను తలఆడించి. అక్కని లోపలకి వెళ్ళనిచ్చి - "సుబ్బమ్మపిన్ని చూసిందట చెప్పిది" అన్నది.

"తప్పునాయనా ఇంకెప్పుడూ మాట్లాడక" అన్నది అక్క మళ్ళీ. అవతమంచి ఆవిడతో ఎందుకు మాట్లాడవద్దంటున్నాదో నాకు అర్థంకాలేదు - "సరే" అని ఊరుకున్నాను.

వాకట్లో పరున్నాను - భావగారువచ్చేరు. వస్తూనే "మీతమ్ముడేడోయ్" అన్నారుఅక్కని

"పడుకున్నాడండి" అన్నది కుసుమ.

"ఇతనికెందుకోయ్ ఆ రత్తాలుతో కబుర్లు - ఏదో తన గొడవ తనుచూచుకోక -" అంటున్నారు బావగారు,

"బాగానేవున్నాదండి - పిల్చిపలకరిస్తే - ఏం చెయ్యమంటారు?" అక్క అడిగింది.

"పలికివచ్చేయ్యాల - వాళ్ళతో అక్కడ కూర్చోడం ఎందుకు ఆ కబుర్లెందుకు - రేపు నువ్వైనా చెప్పువాళ్ళతో అసలు మాట్లాడవద్దని లేవపోతే మంచిదికాదు" బావగారు చాలా సీరియస్ గాచెప్పేరు.

ఇంకా చీకట్లుచెదురుతున్నాయి. అప్పుడే నా రగ్గులోకి మాటలు ప్రవేశించాయి.

"చూశావో ఎంకాయమ్మా - రత్తాలు మాళ్ళీ ఆ కొండమ్మని యంటేసుకపోయాడట - ఎన్నెళ్ళనిండినా ఆదేబతుకా మళ్ళీ అందరికంటే పెద్ద తనేపదిమందికిచెప్పాల్సిందిపోయింది. తనేఅట్టాటి పనులా - మరీ ఇట్టూరం - దాని మొగుడు సరే సరి ఎన్నిసార్లు ఎవరితో లేచిపోయినా దాన్తోనే కాపరంచేస్తాడు - ఆడేఁ మనిషో!" అంటున్నాది అక్కతో అత్తయ్యగారు.

రత్తాలా! నాగుండె ఆగినంతపనయింది. నిన్నంత చక్కగా విమర్శించేడు - రెడ్డిగారి కూతురట. ఆవిణ్ణి - నిద్రపట్టింది నాకు తిరిగి.

"లేమావఁయ్యా లే -ఎనిమిదయ్యింది"-అంటూ కుసుమవచ్చి రగ్గులాగేసింది - తెల్లవారుజామున వినపడ్డమాటలు కలయో మేమో అనుకుంటున్నాను - కళ్లునులుపుకుంటూను.

"మానెవా మాఁవయ్యా - కొండమ్మేమో పుట్టింటికి వెళ్ళిందట -రత్తాలునాన్నేమోపట్నం వెళ్ళేడట - ఇద్దరూ కలేసిముత్తేసరం-కాఫీవటుల్లో రామారావన్నయ్యకి కనపడ్డారట" ఎంత రామాయణం మూడుముక్కల్లో చెప్పింది.

"క్రిందటేడూ ఇంతే మాఁవయ్యా మొగుడితో చెప్పకుండా ఎక్కడికో ఎళ్ళిపోయింది" అన్నది తిరిగి

"సరే లే తెల్లారకుండా మంచివార్తే తెచ్చావు అసలా కొండమ్మ ఎవరూ?" అన్నాను.

"ఎవరా మీ (పెండు నిన్న మాట్టేడేవు పెద్దమ్మగారింట్లోను పప్పు రుబ్బుతుంటేనూ ఆవిడ,"

"ఆఁ ఆవిడా! అవిడ కొండమ్మా," అన్నాను ఆశ్చర్యంగాను.

కాఫీపుచ్చుకుని వీధిలోకూర్చున్నాను ఏమిటో కొండమ్మంటే కొత్తగాను రత్తాలంటే పాతగాను వున్నది. వాతావరణంచాలా అనుకూలంగా వున్నది తుపాకీ ఖజాన వేసుకుబయల్దేరాను.

ఎదురుగా ఆవేళంలోకి పెద్ద కొంగలమంద రెక్కలువచ్చిన మేఘంలావస్తూంటే బారుపెట్టి పేల్చాను. ఈసారికూడా "గుళ్ళు" (రవ్వలు) చాలా మెలుకుతో ప్రవర్తించేయి ఒక్కదానికీ తగల్లేదు.

"అసలు పిట్టలుసత్తాయాండి తగిల్తేను" అన్నది అంతరాత్మలో ప్రశ్నవర్గం.

"తగుల్తే ఛస్తాయిలెండి అసలు తగిల్తేగా" అన్నది అంతరాత్మలో సమాధానవర్గం.

యథాప్రకారం తుపాకీఖజానా క్రమించింది. ముందుకినడిచేను పాతవిషయాన్ని విమర్శించుకుంటూ. ★